క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

అల్లవరం: వార్షిక మరమ్మతుల కారణంగా అల్లవరం, దేవగుప్తం, బెండమూర్లంక సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లవరం, గోడి, గోడిలంక, మొగళ్ళమూరు, తుమ్మలపల్లి, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, ఓడలరేవు, దేవగుప్తం, సామంతకుర్రు, డి.రావులపాలెం, గుండెపూడి తదితర గ్రామాల్లో విద్యుత్‌ను నిలిపివేయనున్నట్టు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే ఆనందరావుకు సత్కారం


ఎమ్మెల్యే ఆనందరావును సత్కరిస్తున్న బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో అమలాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన అయితాబత్తుల ఆనందరావుకు పట్టణ బంగారు, వెండి వర్తకుల సంఘం (బులియన్ అసోసియేషన్) ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఘనంగా సత్కారించారు. బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన ఈ అభినందన కార్యక్రమంలో ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు చింతలపల్లి సత్తిబాబు, రేకపల్లి సూరిబాబు, రాయుడు నాని తదితరులు పాల్గొని ఎమ్మెల్యేను సత్కరించారు. పలువురు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. నియోజకవర్గ టీఎస్‌టీయూసీ అధ్యక్షుడు వలవల శివరావు తదితరులు ఎమ్మెల్యేను సత్కరించి అభినందించారు.

డైరెక్టర్ పదవికి రాజీనామా


రాజీనామా పత్రం తో రమేష్‌బాబు


అమలాపురం రూరల్: రాష్ట్ర బీసీ కార్పొరేషన్‌లో శాఖలో కర్ణ, కరికాల భక్తుల అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి అమలాపురం సమనసకు చెందిన కరెళ్ళ రమేష్‌బాబు రాజీనామా చేశారు. ఆ రాజీనామా పత్రాన్ని బీసీ వెల్ఫేర్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కార్పొరేషన్ చైర్మన్‌కు పంపించినట్టు గురువారం తెలియజేశారు. ఎన్నికలలో టీడీపీ అధికారంలోకి రావడంతో నైతిక బాధ్యత వహించి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. పార్టీ అధికారంలో లేనప్పుడు నామినేటెడ్ పదవిలో కొనసాగడం తనకు ఇష్టం లేదని పేర్కొన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌లు చేనేత కమ్యూనిటీని గుర్తించి నేతన్న నేస్తం కింద రూ.24,000 రూపాయలు నేతన్నకు ఇస్తూ చేనేతలోని కరికాల భక్తులను గుర్తించి కర్ణ, కరికాల భక్తుల కార్పొరేషన్ పెట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు.

'సమతం'కు నివాళి


సమతం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: యానాం పూర్వపు మేయర్ సమతం కృష్ణయ్యనాయుడు వర్ధంతిని గురువారం సమాచారశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఫెర్రీరోడ్డులోని ఆయన విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మురుగునాందం, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఏపీ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు సమావేశం కోరారు. రైతు బజార్‌లో మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో యూనియన్ నాయకుడు దొమ్మేటి రాధాకృష్ణ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఉద్యోగులకు నెలకు ఎనిమిది వేల వేతనం తగ్గకుండా చూస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విత్తన ఎంపికే అత్యంత కీలకం

- నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు
- సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

అమలాపురం రూరల్: తొలకరి పలకరించింది. ఖరీఫ్ మొదలైంది. రైతాంగం సాగుకు సమాయత్తమైంది. అంతా పనుల్లో నిమగ్నమయ్యారు. అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి గత ప్రభుత్వం కాలువల ద్వారా నీటిని విడుదల చేయడంతో రైతులు పనుల్లో పడ్డారు. ఈ సమయంలో ఖరీఫ్ సీజన్‌లో అనువైన విత్తనాలు, ఎరువులు ఎంచుకోవడం ముఖ్యం. విత్తనాల ఎంపికలోనే దిగుబడి ఆధారపడి ఉంటుంది. మంచి విత్తనాలు ఎంపిక చేసుకోవడంతో అధిక దిడుబడి పొందవచ్చని అమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎంఏ షంషి సూచించారు. ఖరీఫ్‌లో అమలాపురం నియోజకవర్గంలో రైతులు సాగు చేసే వరి విత్తనాల రకాలు, సస్యరక్షణ చర్యలను ఆయన వివరించారు.

ఎంటీయూ 7023 (స్వర్ణ)

అధిక సంఖ్యలో రైతులు స్వర్ణ రకాన్నే సాగు చేస్తారు. ఇంచుమించు 50 శాతం మంది రైతులు ఖరీఫ్‌లో ఎక్కువగా ఈ రకాన్నే ఎంచుకుంటారు. స్వర్ణ 155 రోజులకు కోతకు వస్తుంది. ఎక్కువగా గాలికి, వర్షాలకు పడిపోయే స్వభావంతో పాటు తెగుళ్లను అంతగా తట్టుకోలేకపోయినా అధిక దిగుబడినిస్తుంది. ఎకరాకు 30–35 బస్తాల దిగుబడి వస్తుంది. అందుకే రైతులు ఎక్కువగా దీని వైపు మొగ్గు చూపుతున్నారు.


ఖరీఫ్ సీజన్‌లో దమ్ములు చేస్తున్న రైతులు

ఎంటీయూ 1318

సార్వలో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318 వరి రకాన్ని మార్టేరు వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు రూపొందించారు. ఇది నూతన వరి వంగడం. 155–160 రోజుల్లో పంట చేతికొస్తుంది. ముఖ్యంగా పాము పొడ తెగులు, దోమపోటు అగ్గి తెగులును తట్టుకోవడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాల సమయంలో గాలులకు ఒరిగిపోకుండా అధిక దిగుబడి ఇస్తుంది. నీటి వసతి అధికంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఈ వరి వంగడాన్ని సాగు చేయాలి.

బీపీటీ 5204 (సాంబమసూరి)

బీపీటీ 5204 (సాంబమసూరి) పంట కాలం 155 నుంచి 160 రోజులు ఉంటుంది. ఇది సన్నకరం ఫైన్ క్వాలిటీ. మన ప్రాంతంలో రైతులు ఎక్కువగా దీన్ని పండిస్తారు. దీనికి బ్యాక్టీరియా ఎండు తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. అందుకే రైతులు ఎక్కువగా దీన్ని సాగు చేయడం లేదు.

ఎంటీయూ 1061 (ఇంద్ర)

స్వర్ణ రకం మాదిరిగానే 150 నుంచి 155 రోజుల్లో పంట వస్తుంది. ముంపు ప్రాంతాలలో దీన్ని సాగు చేసుకోవచ్చు. ఎందుకంటే ఎక్కువ రోజులు నీటిలో ఉన్న పంటకు నష్టం ఉండదు. వర్షాలు గాలికి పడిపోయే గుణం తక్కువ. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా దీన్ని సాగు చేసుకుంటే మంచిది.


నడిపూడిలో రైతులు వేసిన నారుమళ్లు

ఎంటీయూ 1064

తొలకరిలో స్వర్ణకు ప్రత్నాయ్నాయంగా తయారు చేసిన రకం పంట కాలం 145 రోజులు 150 రోజులు. ఎకరాకు 25 నుంచి 30 బస్తాల దిగుబడి వస్తుంది. స్వర్ణకు ధీటుగా దిగుబడిని ఇవ్వడం లేదనే కారణంతో రైతులు ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు. ముంపు ప్రాంతాలకు కూడా ఇది అనువైన రకం.

ఎంటీయూ 1075

ఈ వరి ఎక్కువ పొడవుగా ఎదుగుతుంది. పడిపోయే గుణం తక్కువ. దీని పంట కాలం 145 నుం 150 రోజులు. దిగుబడి ఎకరాకు 25 నుంచి 28 బస్తాల వరకు వస్తుంది.

ఎంటీయూ 1121

ఇది ఫైన్ క్వాలిటీ సన్న రకం. 150 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఇది కొంత వరకూ దోరును తట్టుకుంటుంది. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది.

డ్రైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


పీడబ్ల్యూడీ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే అశోక్ సమావేశం

యానాం: నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో చేపడుతున్న వివిధ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. గురువారం పీడబ్ల్యూడీ అధికారులతో వివిధ పనులు పూర్తి తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీల పనులు చేపడుతున్న నేపథ్యంలో వర్షాలు కురుస్తున్నందున ఆ నీరు అసంపూర్తి నిర్మాణాలలోకి వెళ్లడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని తక్షణం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దరియాలతిప్ప ఐలాండ్ నంబరు-3లో ఎస్సీ ఫీల్డ్‌లేబర్ సొసైటీకి ఇచ్చిన భూములు గోదావరి వరదల సమయంలో మునిగిపోతుందని తక్షణం వరద నీరు రాకుండా రక్షణ గోడ నిర్మాణం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్, పితాని భాస్కర్, భగవాన్, బొడ్డు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటకు రైతుల డుమ్మా

- 68 మంది రైతులకూ ఒక్కరే హాజరు
- సుమారు రూ.10 లక్షలకు ఫైగా బకాయిలు

తాళ్లరేవు: కేశవపురం గ్రామంలో ఉన్న శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారి దేవస్థాన భూముల కౌలుకు సంబంధించి గురువారం నిర్వహించిన బహిరంగ వేలంపాటకు రైతులు డుమ్మా కొట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 102.27 ఎకరాల భూములు సాగు చేసుకునేందుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. కాజులూరు మండలం కుయ్యేరు సమీపంలోని పాలమూరు పాడులో ఉన్న భూములను ప్రస్తుతం 68 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. 2024–25 నుంచి 2026–27 వరకు సాగు చేసుకునే నిమిత్తం వేలం పాట ఏర్పాటు చేశారు. అయితే సాగు చేసుకుంటున్న రైతులు హాజరుకాకపోగా, కొత్తవారు కూడా రాలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ భూములను సాగు చేస్తున్న రైతులు పూర్తిగా బకాయిలు చెల్లించి తిరిగి వేలం పాటలో పాల్గొనాలని ఉంది. కొత్తవారు సైతం ఈ భూములను సాగు చేసుకునేందుకు సంబంధిత పత్రాలతో వేలం పాటకు హాజరు కావాల్సి ఉంది. అయితే నిర్ణీత సమయానికి ఒకే ఒక్క రైతు హాజరు కావడం అంతా విస్మయానికి గురయ్యారు. ఈ భూములకు సంబంధించి సుమారు రూ.10 లక్షల మేర బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ భూములకు సంబంధించి గత నెల 3వ తేదీ నుంచి 4 వరకూ, 21వ తేదీ నుంచి 22 వరకూ రెండు పర్యాయాలు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. అయినప్పటికీ ఒక్క రైతు కూడా వేలంపాటలో పాల్గొనని కారణంగా మూడో పర్యాయం గురు, శుక్ర వారాలలో వేలం పాటలకు ప్రకటన ఇచ్చారు. కాగా తొలిరోజు రైతులు హాజరుకాకపోవడంతో అధికారులు అవాక్కయ్యారు. శుక్రవారం కూడా చూసి పరిస్థితిని దేవదాయ కమిషనర్‌కు వివరిస్తామని ఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు.


కేశవస్వామిలో జరిగే వేలం పాటలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

- 'మేరీలైఫ్' కార్యక్రమాన్ని పాఠశాలల్లో అమలు చేయండి
- డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు

ఐ.పోలవరం: సమాజంలో ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా భావించాలని, డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు పిలుపునిచ్చారు. ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం నిర్వహించిన 'మేరీలైఫ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వి.సురేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏపీసీ మధుసూదనరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాలు మేరీలైఫ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం మేరీ లైఫ్ కార్యక్రమాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేస్తోందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు కలిసి సంయుక్తంగా మేరిలైఫ్ కార్యక్రమాన్ని షెడ్యూల్ వారీగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమాలను నిర్వహించి ఫొటోలు, వీడియోలు తీసి గూగుల్ ట్రాక్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమాజంలో ప్రజలకు అవగాహన కల్పించాలని, పర్యావరణ పరిరక్షణ పద్ధతుల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు కొండారెడ్డి, తిరుమలరావు తదితరులు పర్యావరణ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఆరోగ్యకరమైన జీవనశైలిని దత్తత తీసుకోవడంలో పాఠశాల ఆవరణలో ఏపీసీ మధుసూదనరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ కలెక్టర్, ఏపీసీ మధుసూదనరావు

లోకాయుక్త ఆదేశాలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ, వరప్రసాద్

కోరంగి భూములను పట్టాదారులకు అప్పగించాలని డిమాండ్

తాళ్లరేవు: కోరంగి గ్రామంలో బలహీన వర్గాలకు కేటాయించిన భూములను పట్టాదారులకు అప్పగించాలని లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోరంగిలో బలహీన వర్గాలకు కేటాయించిన సుమారు 70 ఎకరాల భూములు అన్యాక్రాంతం కావడంతో పట్టాదారులు లోకాయుక్తాకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై 2021 ఆగస్టు 10న అప్పటి జిల్లా కలెక్టర్ లోకాయుక్తాకు నివేదిక సమర్పించారన్నారు. ఈ నివేదికను పరిశీలించిన లోకాయుక్తా జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి 2022 ఆగస్టు 11న ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం 9–77 చట్ట ప్రకారం లబ్ధిదారులు, వారి వారసులకు అప్పగించేందుకు తహసీల్దార్ చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటివరకు వారు తగిన చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కులస్తుల భూములపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్ట ప్రకారం నేరమన్నారు. ఈ మేరకు బాధ్యులైన అధికారులందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భూముల విషయమై హైకోర్టు సీనియర్ న్యాయవాది బొజ్జా తారకం పోరాడారని, ఈ నెల 27న ఆయన జయంతి సందర్భంగా ఈ భూములకు పట్టాలు, పాస్ పుస్తకాలు తిరిగి పంపిణీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్, తాడి షణ్ముఖరాజు, వెంటపల్లి వెంకటరమణ, సిద్ధన రామకృష్ణ, పోతురాజు ఆనందరావు పాల్గొన్నారు.

పడిన చెట్లను తొలగించి..


చల్లపల్లి ప్రధాన కాలువలో పడిపోయిన చెట్లు తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

ఉప్పలగుప్తం: ఇటీవల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు చెట్లు కూళి కాలువలో పడి సాగునీటికి ఆటంకం కలిగించడంతో 'నీటి ప్రవహానికి అవరోధం' అనే శీర్షికతో సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. మండలంలోని చల్లపల్లి ప్రధాన కాలువలో పడిపోయిన చెట్లని జేసీబీల సహాయంతో గురువారం తొలగించారు. సాగునీరు ప్రవహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆక్రమణలో ప్రయాణికుల విశ్రాంతి భవనం

యానాం: సావిత్రినగర్‌లో మున్సిపాలిటీ ప్రయాణికుల ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనాన్ని ఆక్రమించి షాపులను నిర్మించుకున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని గురువారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తీర గ్రామమైన సావిత్రినగర్ నియోజకవర్గానికి శివారున ఉంది. ఇక్కడ నుంచి యానాంకు వందలాది మంది ప్రజలు వస్తుంటారు. మత్స్యకారుల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 20 ఏళ్ల క్రితం ప్రయాణికులు వేచి ఉండేందుకు విశ్రాంత భవనం నిర్మించారు. అయితే విశ్రాంతి భవనాన్ని మల్లాడి రామకృష్ణ అనే వ్యక్తి అనుమతులు లేకుండా దాని గోడలను కూల్చేసి షాపులుగా నిర్మాణం చేసి షెట్టర్లు ఏర్పాటు చేసుకున్నాడని, అంతేకాకుండా ఆ షాపులను రూ.2.50 లక్షలకు మరొకరికి విక్రయించాడని స్థానికులు తెలిపారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.


సావిత్రి నగర్‌లో విశ్రాంతి భవనంలో షాపులు నిర్మాణం

ఆలయ భూముల కౌలుకు వేలం

ఐ పోలవరం: మురమళ్లలో కొలువైన వీరేశ్వర స్వామి వారి ఆలయానికి సంబంధించి భూములకు గురువారం అధికారులు కౌలు వేలం నిర్వహించారు. తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో కోలంక, ఐ.పోలవరం, మురమళ్ల, గాడిలంక గ్రామాల్లోని భూములకు వేలం పాట జరిగింది. కోలంక గ్రామంలో 3.20 ఎకరాలకు గాను రూ.90వేలు, ఐ.పోలవరంలోని 4.76 ఎకరాలకు రూ.1.75లక్షలు, మరో 10.75 ఎకరాలకు రూ.2.22లక్షలు, మురమళ్లలో 0.27 సెంట్లకు రూ.7.2 వేలు, గాడిలంకలో 88 సెంట్లకు రూ.70వేలు చొప్పున వేలం పాట ద్వారా ఆదాయం సమకూరింది. కొమరగిరి, మురమళ్ల, కొమానపల్లి, అన్నంపల్లి గ్రామాలలో మరి కొన్ని భూములకు వేలంపాట ఈ నెల 19కు వాయిదా వేసినట్టు పెనుమల్లే లక్ష్మీవాడ గ్రామం వీరేశ్వర స్వామివారి దేవస్థానానికి సంబంధించి 4.46 ఎకరాల భూమికి శుక్రవారం సాయంత్రం వేలం జరుగుతుందన్నారు.


మురమళ్లలో వేలం పాటకు హాజరైన ఔత్సాహికులు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం రూరల్: వెంటనే ఉపాధి కూలీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని బండారులంక, నడిపూడి గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. పనులను పరిశీలించారు. ఉపాధి కార్మికులకు పనిదినాలు 200 రోజులు పెంచాలని, కూలి రేట్లు రూ.600 పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాలమూరి శ్రీనివాసరావు, మెట్ల ఎం.రాజేశ్వరి, తేజ కుమారి, టి.లక్ష్మీశ్రీదేవి, దుర్గాదేవి, ఎస్.నాగలక్ష్మి, జి.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.


నడిపూడిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

తెరుచుకున్న పాఠశాలలు

కాట్రేనికోన: వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. ఆటవిడుపునకు టాటా చెబుతూ విద్యార్థులు పుస్తకాలు చేతబట్టి బడుల బాట పట్టారు. ఈనెల 12న ప్రారంభం కావలసి పాఠశాలలు సీఎం ప్రమాణ స్వీకారంతో విద్యాశాఖ ఈ రోజుకు మార్పు చేసింది. పాఠశాలలు ప్రారంభం మొదటి రోజు కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు యథావిధిగా వచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం 8 రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యా కానుల కిట్లను పంపిణీకి ఏర్పాటు చేశారు.

బదిలీ చేసినా వెళ్లడంలేదు ఎందుకు?

యానాం: స్థానిక పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ)శాఖలో ఏళ్ల తరబడి పని చేస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్లు, జూనియర్ ఇంజినీర్లను బదిలీ చేస్తూ మార్చిలో పుదుచ్చేరి చీఫ్ ఇంజినీరు కె.వీరసెల్వం ఆదేశాలిచ్చినప్పటికీ వారు వెళ్లడం లేదని పేర్కొంటూ కొందరు సమాచార హక్కు చట్టం ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పీడబ్ల్యూడీ సబ్ డివిజన్–1లో అసిస్టెంట్ ఇంజినీరుగా పనిచేస్తున్న కె.నాగరాజును సబ్‌డివిజన్–2కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అదేవిధంగా జూనియర్ ఇంజినీరు పీవీఎస్ భాస్కర్‌రావును సబ్‌డివిజన్–1కు బదిలీ చేశారు. చీఫ్ ఇంజినీరు ఆదేశాలను ధిక్కరిస్తున్నారని పేర్కొంటూ ఆర్‌టీఐ ద్వారా ఆదిమూలం శ్రీనివాస్ సమాచారం అడిగారు. దీనిపై ఈఈ చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలిక కుటుంబానికి సాయం

యానాం: పుదుచ్చేరిలో హత్యకు గురైన తొమ్మిదేళ్ల బాలిక కుటుంబానికి సీఎం రంగసామి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మార్చిలో ముత్తులియ్‌పేట ప్రాంతంలో మైనర్‌పై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటన నిరసిస్తూ యానాం, మాహే, కారైకల్ ప్రాంతాల్లో భారీ ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో నిందితులిద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో బాలిక కుటుంబానికి ఆదిద్రావిడార్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నుంచి మొదటి వాయిదా పరిహారంగా రూ.4.12 లక్షలు, అట్రాసిటీ యాక్ట్ ద్వారా రూ.3లక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ సెల్వం, వ్యవసాయ శాఖ మంత్రి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

అమలాపురం రూరల్: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐ.పోలవరం మండల పరిధిలోని జి.వేమవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, పర్యావరణానికి హాని కలిగించే అంశాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ, సంయుక్తంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాలు 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

యువతికి అండగా పోరాటం

కాట్రేనికోన: ప్రేమించిన యువకుడితో పెళ్లి జరిగేంత వరకూ బాధిత యువతకు అండగా నిలిచి న్యాయ పోరాటం చేస్తామని కొంకి రాజామణి, సామాజిక కార్యకర్త గెల్లా రాజేంద్ర అన్నారు. దొంతికుర్రు గ్రామానికి చెందిన దళిత యువతి, ఉప్పూడికి చెందిన సాపే నాగరాజు ప్రేమించుకున్నారు. నాగరాజు పెళ్లికి మొహం చాటేయడంతో యువతి ఆరు నెలల క్రితం జనవరిలో పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి నాగరాజును రిమాండ్‌కు పంపించారు. యువతిని పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో పోలీసులు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే పత్రికా రంగానికి చెందిన ఒక వ్యక్తి ఒత్తిడితో తన ప్రియుడుపై కేసు పెట్టి రిమాండుకు పంపించారని ఆరోపించింది. పోలీసులపై మీరు ఒత్తిడి చేయడం వల్లనే నాకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ గురువారం పెద్దల సమక్షంలో సదరు వ్యక్తి ఇంటికి వెళ్లి నిరసనకు దిగింది. బాధితురాలుకి మద్దతుగా కొంకి రాజామణి, సామాజిక కార్యకర్త గెల్లా రాజేంద్ర తదితరులు ఉన్నారు.